సాక్షి
నిజామాబాద్
బుధవారం । 24 । సెప్టెంబర్ । 2025



డైట్ బిల్లులు వచ్చేదెప్పుడో?

ప్రభుత్వ వసతి గృహాలకు కొన్ని నెలలుగా డైట్ బిల్లులు రావడం లేదు. విద్యార్థులు, వార్డెన్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- 8లో ▸



వారం రోజులు..

నిజామాబాద్ శివార్లలోని తాళం వేసిన ఇళ్లను దొంగలు టార్గెట్ చేస్తున్నారు. వారం రోజుల్లో రెండు భారీ చోరీలు జరిగాయి.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
34.9 /22.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ ఎక్కువగా ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురుస్తుంది.

న్యూస్‌రీల్

జిల్లాకు ఆరెంజ్ అలర్ట్

నిజామాబాద్‌అర్బన్: జిల్లాకు భారీ వర్షసూచన ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించింది. ఆరెంజ్ అలర్ట్ జారీ చేయడంతో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. కాగా జిల్లా వ్యాప్తంగా సోమవారం రాత్రి , మంగళవారం పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. జిల్లాలో అత్యధికంగా కోటగిరిలో 36.4 మి.మీటర్లు , వర్నిలో 23.4, పాతంగల్‌లో 18.3 , చందూర్‌లో 22.8, భీమ్‌గల్‌లో 22.4, డిచ్‌పల్లిలో 15.0, నందిపేటలో 13.5, రెంజల్‌లో 18.6, మోపాల్‌లో 14.1 మి.మీటర్ల వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా 11.0 మి.మీటర్ల వర్షం కురిసింది. మధ్యాహ్నం వేళ రెండు గంటలపాటు ఏకధాటిగా వర్షం కురిసింది. జిల్లా కేంద్రంలో రోడ్లు జలమయమయ్యాయి. రైల్వేస్టేషన్, బస్టాండ్ పరిసరాల్లో వర్షపు నీరు నిలువడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

దసరాకు ఆర్టీసీ ప్రత్యేక లక్కీ డ్రా



ఖలీల్‌వాడి: దసరా సందర్భంగా ప్రయాణికుల కోసం తెలంగాణ రాష్ట్ర రోడ్డురవాణా సంస్థ ప్రత్యేక లక్కీ డ్రా స్కీమ్‌ను ప్రకటించిందని ఆర్‌ఎం జ్యోత్స్న మంగళవారం తెలిపారు. సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 6వ తేదీ వరకు సెమీ డీలక్స్, డీలక్స్, సూపర్ లగ్జరీ, లహరి, నాన్-ఏసీ, అన్ని ఏసీ బస్సుల్లో ప్రయాణించే వారు లక్కీ డ్రాకి అర్హులని తెలిపారు. ప్రయాణికులు తమ బస్ టికెట్ల వెనుక పేరు, చిరునామా, ఫోన్ నంబర్ వివరాలు రాసి ఆ టికెట్లను బస్సు స్టేషన్‌లలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బాక్స్‌లలో వేయాలని సూచించారు. సేకరించిన అన్ని టికెట్లలో నుంచి అక్టోబర్ 8వ తేదీన రీజినల్ కార్యాలయంలో లక్కీ డ్రా తీయనున్నట్లు తెలిపారు. రీజియన్ నుంచి ముగ్గురు విజేతలకు బహుమతులు అందజేస్తామని, నగదు బహుమతులు ఉంటాయన్నారు. మొదటి బహుమతి రూ.25 వేలు, రెండో బహుమతి రూ. 15 వేలు, మూడో బహుమతి రూ.10 వేలు ఇస్తామని వివరించారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి లక్కీడ్రాలో పాల్గొనాలని ఆమె కోరారు.

ఎంపిక చేసిన కేసులను ఇన్వెస్టిగేట్ చేయండి

- ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లకు సీపీ సాయి చైతన్య ఆదేశాలు
- వీడియోకాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం



ఖలీల్‌వాడి: ఎంపిక చేసిన కేసులను ఇన్వెస్టిగేట్ చేయాలని ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లను సీపీ సాయిచైతన్య ఆదేశించారు. డీజీపీ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని కమిషనరేట్ నుంచి ఆయన మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏఎస్సైలు, హెడ్‌కానిస్టేబుళ్లతో మాట్లాడారు. మిస్సింగ్, అసహజ మరణాల వంటి 89 కేసులను ఇన్వెస్టిగేట్ చేయాలన్నారు. ప్రజలకు సత్వర న్యాయం ఏ విధంగా అందుతుందో వివరించారు. హెచ్‌సీలు, ఏఎస్సైలు నిర్దేశిత కేసులను ఇన్వెస్టిగేట్ చేస్తే, ఎస్సైలు, సీఐలకు ఇతర ముఖ్యమైన కేసుల ఇన్వెస్టిగేషన్‌కు సమయం దొరుకుతుందన్నారు. వీడియోకాన్ఫరెన్స్‌లో అదనపు డీసీపీ (అడ్మిన్) జి బస్వారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిధుల దారి మళ్లుతోంది

- కేంద్ర ప్రభుత్వ నిధులను రాష్ట్రం వాడుకుంటోంది
- అభివృద్ధి పనులు నిలుస్తున్నా అధికార పార్టీ ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు
- దసరా తరువాత ఆర్వోబీల వద్ద ఆందోళనలు చేస్తాం
- దిశ కమిటీ సమావేశంలో ఎంపీ ధర్మపురి అర్వింద్



దిశ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ధర్మపురి అర్వింద్, పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ తదితరులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారిమళ్లిస్తోందని, దీంతో జిల్లాలో నిర్దేశిత పనులకు నిధులు అందక ఆగిపోతున్నాయని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. ఎంపీ అధ్యక్షతన కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ (దిశ) సమావేశం జరిగింది. కేంద్ర ప్రభుత్వ నిధులతో వివిద శాఖల్లో చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా అర్వింద్ మాట్లాడుతూ.. జాతీయ రహదారుల విషయంలో మొత్తం ఎనిమిది ప్యాకేజీలు ప్రతిపాదిస్తే, రాష్ట్ర ప్రభుత్వం కోత విధించి రెండు మాత్రమే మంజూరు తీసుకుందన్నారు. జిల్లాలో ఉన్న కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు ఏం చేస్తున్నారన్నారని ప్రశ్నించారు. మాధవనగర్, మామిడిపల్లి రైల్వే వంతెనలకు సంబంధించిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం తనవద్దే పెట్టుకుందని, మామిడిపల్లి వంతెన పూర్తయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం రూ.3.5 కోట్లు ఇవ్వకపోవడంతో బీటీ రోడ్డు వేయడం లేదన్నారు. అర్సపల్లి వంతెన విషయంలో భూసేకరణ చేయడం లేదని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై దసరా తరువాత మూడు వంతెనల వద్ద ఆందోళనలు చేయాలని బీజేపీ శ్రేణులకు ఎంపీ పిలుపునిచ్చారు. డబ్బులు ఎలా ఇవ్వరో చూద్దామన్నారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డిలకు ప్రజలు పడుతున్న ఇబ్బందులు కనిపించడం లేదా? ఎన్నిసార్లు గుర్తు చేయాలంటూ అసహనం వ్యక్తం చేశారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న మహేశ్‌కుమార్‌గౌడ్ జిల్లాకు రూ.20 కోట్లు కూడా నిధులు తెప్పించుకోలేని స్థితిలో ఉన్నారా అని అన్నారు.

❖ అమృత్ పథకం కింద జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలకు రూ.497 కోట్లు మంజూరైతే అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ, నీటిసరఫరా పనులు రెండేళ్లలో పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఇప్పటివరకు కేవలం 10 శాతం పనులు మాత్రమే పూర్తి చేశారని, అమృత్‌పై దసరా తర్వాత ప్రత్యేకంగా సమీక్ష చేస్తానన్నారు. ఎంపీ లాడ్స్ నిధులతో జరిగే పనులకు కాంగ్రెస్ నాయకులు అడ్డుపడుతున్నారని విమర్శించారు. కేంద్రం నిధులతో జరిగిన పనులకు నేమ్ బోర్డులు ఎందుకు పెట్టడం లేదని అధికారులను ప్రశ్నించారు.

❖ నిజామాబాద్-ఆర్మూర్ మార్గంలో అటవీ భూమికి సంబంధించి సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వివాదాన్ని కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించానని, దీంతో రెండు ప్రదేశాల్లో రోడ్డు విస్తరణకు మార్గం సుగుమమైందని తెలిపారు.

❖ భారీ వర్షాల కారణంగా జిల్లాలో 40 వేల ఎకరాలకు పైగా పంటలు నష్టపోతే అధికారులు 17 వేల ఎకరాల్లో మాత్రమే నష్టం జరిగినట్లు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారన్నారు. మరోసారి సర్వే చేసి బాధిత రైతులందరికీ నష్టపరిహారం అందేలా చూడాలని ఎంపీ అధికారులను కోరారు.

❖ నిజామాబాద్ నగరపాలక సంస్థ పరిధిలో వార్డుల వారీగా రావాల్సిన పన్ను వివరాలను తెలుపాలన్నారు. ఆర్మూర్ డివిజన్‌లో రోడ్ల పనుల విషయంలో సరైన సమాధానాలు చెప్పనందుకు డీఈ రాజేశ్వర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాడీ లాంగ్వేజ్ మార్చుకోవాలని సూచించారు.

❖ నిజామాబాద్ నగరంలో పన్ను చెల్లించని వ్యాపారులతోపాటు భవనాలు చాలా ఉన్నాయని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. సుమారు రూ.20 కోట్లు బకాయిలున్నాయని తెలిపారు. పులాంగ్ వాగు ముబారక్‌నగర్ వరకు చాలా చోట్ల ఆక్రమణలకు గురైందన్నారు. నాగారం వద్ద నిజాంసాగర్ కాలువ సైతం కబ్జా అయిందన్నారు. బోధన్ రోడ్డులోని రామర్తి చెరువు, బొందెం చెరువులు సైతం భారీగా ఆక్రమణలకు గురయ్యాయన్నారు. నగరపాలకంలో రెవెన్యూ విభాగం స్క్రీనింగ్ చేయాలన్నారు.

సమావేశంలో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, డీఎఫ్‌వో వికాస్ మీనా, ట్రైనీ కలెక్టర్ కరోలినా చింగ్తియాన్ మావి, నగరపాలక కమిషనర్ దిలీప్ కుమార్, డీఆర్డీవో సాయాగౌడ్, దిశ కమిటీ సభ్యులు హన్మంతరావు, ఆశన్న, లింగం, విజయ పాల్గొన్నారు.

గుడ్డు పట్టుకొచ్చిన సభ్యురాలు

అంగన్‌వాడీలు, ప్రభుత్వ పాఠశాలకు తక్కువ బరువు, నాణ్యత లేనివి గుడ్లను సరఫరా చేస్తున్నారని దిశ కమిటీ సభ్యురాలు విజయ అన్నారు. గుడ్డు తీసుకొచ్చి సమావేశంలో చూపించి ఫిర్యాదు చేశారు. దీంతో ఎంపీ చిన్నసైజు గుడ్ల సరఫరాపై ఎంపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. 50 నుంచి 60 గ్రాములు ఉండాల్సిన కోడి గుడ్డు 30 గ్రాములు మాత్రమే ఉండడం చూస్తుంటే అవినీతి జరుగుతున్నట్లు అర్థమవుతోందన్నారు. చిన్నపిల్లలు, గర్భిణులు, బాలింతలకు ఇచ్చే పౌష్టికాహారం విషయంలో కక్కుర్తి పడితే కేసీఆర్‌కు పట్టిన గతే కాంగ్రెస్ ప్రభుత్వానికి పడుతుందన్నారు. కోడిగుడ్ల సరఫరాపై పూర్తి స్థాయిలో విచారణ చేయాలని కలెక్టర్‌కు ఎంపీ సూచించారు. అలాగే పాఠశాలల్లో మధ్యాహ్న భోజన బిల్లులను 1 నుంచి 8 తరగతుల వరకు కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తోందని, మిగతా తరగతులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో భోజన ఏజెన్సీలకు బకాయిలు ఉన్నాయన్నారు.





హాజరైన వివిధశాఖల అధికారులు, దిశ కమిటీ సభ్యులు

‘మహా’ అప్రమత్తం!



ఎస్సారెస్పీ ప్రస్తుత నీటి మట్టం

- ఎస్సారెస్పీలోకి భారీ ఇన్‌ఫ్లో వచ్చే అవకాశం ఉందని సమాచారం
- ప్రాజెక్టు నీటి మట్టాన్ని తగ్గిస్తున్న అధికారులు
- 70 టీఎంసీలకు పడిపోయిన నీటి నిల్వ

బాల్కొండ: మహారాష్ట్ర ప్రాంతం నుంచి భారీ వరదలు వచ్చే అవకాశాలున్నాయనే సమాచారంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ అధికారులు అప్రమత్తమయ్యారు. గత మూడు రోజులుగా ఇన్‌ఫ్లో పెరుగుతూ తగ్గుతోంది. దీంతో అధికారులు ప్రాజెక్ట్ నీటి మట్టాన్ని తగ్గిస్తూ పెంచుతూ వచ్చారు. కానీ ఇన్‌ఫ్లోతో సంబంధం లేకుండా మంగళవారం రోజున 2.85 లక్షల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేశారు. దీంతో ప్రాజెక్ట్ నీటి మట్టం 80.5 టీఎంసీల నుంచి సాయంత్రం వరకు 70 టీఎంసీల కు తగ్గిపోయింది. సాయంత్రానికి ఇన్‌ఫ్లో 2.20 లక్షల క్యూసెక్కులు పెరిగింది. మహారాష్ట్ర నుంచి భారీ వరదలు వచ్చే అవకాశం ఉందని, గోదావరి పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాజెక్ట్ అధికారులు సూచించారు.

కొనసాగుతున్న నీటి విడుదల

వరద గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. 40 గేట్ల ద్వారా 2.85 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే వరద కాలువ ద్వారా 6,735 క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 5,500, ఎస్కేప్ గేట్ల ద్వారా 2,500, లక్ష్మి కాలువ ద్వారా 200, సరస్వతి కాలువ ద్వారా 400, అలీసాగర్ లిఫ్ట్ ద్వారా 180 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మిషన్‌భగీరథ అవసరాలకు 231 క్యూసెక్కులను వినియోగిస్తుండగా ఆవిరి రూపంలో 709 క్యూసెక్కుల నీరుపోతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా మంగళవారం సాయంత్రం 1088.00 (70 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉంది.

అంతర్రాష్ట్ర వంతెనను ఆనుకుని..

రెంజల్(బోధన్): రెండు రోజులపాటు నిలకడగా ప్రవహించిన గోదావరి మంగళవారం మళ్లీ పోటెత్తింది. ఎగువన వర్షాలు కురుస్తుండడంతోపాటు మహారాష్ట్ర నుంచి భారీ వరద వస్తుండడంతో కందకుర్తి వద్ద అంతర్రాష్ట్ర వంతెనను ఆనుకుని ప్రవహిస్తోంది. కందకుర్తి పుష్కరక్షేత్రంలోని పురాతన శివాలయం పూర్తిగా నీట మునిగింది.

పనులను సత్వరం పూర్తి చేయాలి

- అధికారులకు కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి ఆదేశం
- అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పనుల ప్రగతిపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ అంకిత్, డీఈవో అశోక్

నిజామాబాద్ అర్బన్: అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ బడుల్లో కొనసాగుతున్న పనులను సత్వరమే పూర్తి చేయాలని కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను పెంపొందించేందుకు వీలుగా చేపట్టిన పనుల ప్రగతిపై కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో మంగళవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఆయా పాఠశాలలకు మంజూరు చేసిన అదనపు తరగతి గదులు, వాటర్ సప్లయ్, టాయిలెట్స్ తదితర పనులు ఏ దశలో ఉన్నాయి, ఎన్ని పనులు పూర్తయ్యాయి, ఇంకా గ్రౌండింగ్ కాని పనులు ఎన్ని తదితర వివరాలను మండలాల వారీగా అడిగి తెలుసుకున్నారు. మౌలిక వసతుల మెరుగు కోసం జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా రూ. 42 కోట్ల విలువ చేసే పనులను మంజూరు చేయగా, రూ.23 కోట్ల విలువైన పనులు జరిగాయని కలెక్టర్ తెలిపారు. వివిధ దశల్లో కొనసాగుతున్న పనులను వేగంగా చేపట్టి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. నిధులు అందుబాటులో ఉన్నందున పట్టణ ప్రాంతాల్లోని బడుల్లో అవసరమైన చోట యుద్ధ ప్రాతిపదికన టాయిలెట్స్, తాగునీరు, విద్యుత్ వసతి వంటి పనులను చేపట్టాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా మంజూరు లభించిన పనుల వివరాలను సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు తెలపాలని ఎంఈవోలను ఆదేశించారు. కాగా, ప్రతి పాఠశాలలో విద్యార్థుల అపార్ ఐడీ తప్పనిసరి జనరేట్ చేయాలని కలెక్టర్ సూచించారు. ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాల కోసం అర్హులైన వారందరూ దరఖాస్తు చేసుకునేలా చొరవ చూపాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, డీఆర్డీవో సాయాగౌడ్, డీఈవో అశోక్, హౌసింగ్ పీడీ పవన్‌కుమార్, ఆయా శాఖల ఇంజినీరింగ్ విభాగం అధికారులు, ఎంఈవోలు, ఐకేపీ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు సరిపడా యూరియా

మోపాల్: జిల్లాలో రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏవో) మేకల గోవిందు అన్నారు. మండలంలోని బాడ్సి సొసైటీ పరిధిలో ఎరువుల గోదామును డీఏవో మంగళవారం తనిఖీ చేశారు. యూరియా నిల్వ, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల అవసరం మేరకు ఎరువులు ఉన్నాయని, ఆందోళన చెందొద్దని స్పష్టం చేశారు. డీలర్లు ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పించాలని, ప్రయోజనాలను వివరించాలన్నారు. ఆయన వెంట బాడ్సి సొసైటీ చైర్మన్ నిమ్మల మోహన్‌రెడ్డి, సీఈవో నర్సయ్య, రైతు మహిపాల్‌రెడ్డి ఉన్నారు.



బాడ్సి సొసైటీ గోదాము రికార్డులను పరిశీలిస్తున్న డీఏవో గోవిందు

మక్క రైతుకు మద్దతేదీ?

- పంట కోత మొదలై పక్షం రోజులైనా ఏర్పాటు కాని కొనుగోలు కేంద్రాలు
- రైతులను దోపిడీ చేస్తున్న దళారులు
- మద్దతు ధర క్వింటాలు రూ.2,400 ఉండగా.. రూ.1,900 లోపే చెల్లింపు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: మొక్కజొన్న పంట కోతలు మొదలై పక్షం రోజులు దాటినప్పటికీ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. ఇది అదునుగా మక్క రైతులను దళారులు దోపిడీ చేస్తున్నారు. మొక్కజొన్నకు మద్దతు ధర రూ.2,400 ఉన్నప్పటికీ కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు తప్పని పరిస్థితుల్లో దళారులకు అమ్ముకోవాల్సి వస్తోంది. అయితే దళారులు రైతులకు క్వింటాలుకు రూ.1,800 నుంచి రూ.1,900 మాత్రమే ధర చెల్లిస్తున్నారు. రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది.

జిల్లాలో 52,093 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. ఈ ఏడాది భారీ వర్షాలతో జిల్లాలో 1,100 ఎకరాల్లో మొక్కజొన్న పంట నాశనమైంది. ఇది అధికారుల ప్రాథమిక అంచనా మాత్రమే. అనధికారికంగా ఈ నష్టం మరింత ఎక్కువగా ఉండడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. కాగా అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో నష్టాన్ని అంచనా వేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందంటూ మంగళవారం జరిగిన దిశ కమిటీ సమావేశంలో ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆగ్రహం వ్యక్తం చేయడం గమనార్హం. ఇప్పటికీ వర్షాలు ఆగకపోతుండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం మక్క కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దిక్కుతోచడంలేదని రైతులు చెబుతున్నారు. కాగా ఈ సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 6 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశారు. సహకార సంఘాలు, మార్క్‌ఫెడ్ ద్వారా మక్కలు కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



■ కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యంపై రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డిని సంప్రదించగా ఈ విషయమై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు లేఖ రాసినట్లు తెలిపారు.

ఎమ్మెల్యే భూపతిరెడ్డి ద్వారా ప్రయత్నాలు



రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మొక్కజొన్న పంటను కొనుగోలు చేసేందుకు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి ద్వారా తగిన ప్రయత్నాలు చేస్తున్నాం. రైతులకు ఇబ్బందులు లేకుండా చూసేందుకు ఎమ్మెల్యే ఇప్పటికే రాష్ట్ర ఉన్నతాధికారులతో చర్చించారు.

– మునిపల్లి సాయిరెడ్డి, మాజీ డీసీఎంఎస్ చైర్మన్

ఆందోళనలు చేస్తాం



మార్క్‌ఫెడ్, సహకార సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వం తక్షణమే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. రైతులను వ్యాపారులు, దళారులు దోపిడీ చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయం. ఇప్పటికే వర్షాలతో నష్టపోయిన రైతులపైన కనికరం చూపాలి. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోతే కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తాం.

– పాట్కూరి తిరుపతిరెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు

సంస్కరణలు కాదు.. భారీ ఊరట

- దేశ ప్రజలకు ప్రధాని మోదీ నవరాత్రుల కానుక
- జీఎస్టీ తగ్గింపుపై ఎంపీ అర్వింద్ ధర్మపురి
- వాహన, ఎలక్ట్రానిక్స్ షోరూమ్‌లతోపాటు సూపర్‌మార్కెట్ సందర్శన



హోండా షోరూంలో జీఎస్టీ తగ్గుదలకు సంబంధించి పోస్టర్ అతికిస్తున్న ఎంపీ అర్వింద్

సుభాష్‌నగర్: జీఎస్టీ తగ్గింపు సంస్కరణలు కాదని.. దేశ ప్రజలకు భారీ ఊరట అని ఎంపీ అర్వింద్ ధర్మపురి పేర్కొన్నారు. దేశ ప్రజలకు ప్రధాని దేవీనవరాత్రుల కానుకు ఇచ్చారన్నారు. వాహన, ఎలక్ట్రానిక్స్ షోరూములతోపాటు ఓ సూపర్ మార్కెట్‌ను ఎంపీ సందర్శించి జీఎస్టీ తగ్గింపునకు సంబంధించిన పోస్టర్లను పరిశీలించారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గోపిడి స్రవంతిరెడ్డితో కలిసి మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జీఎస్టీ తగ్గింపుతో అన్నిరకాల కార్ల ధరలు రూ.60 వేల నుంచి రూ.2లక్షల వరకు తగ్గడంతోపాటు ఇన్సూరెన్స్, రోడ్డు ట్యాక్స్ సైతం తగ్గుతాయని తెలిపారు. ముఖ్యంగా లైఫ్, హెల్త్ ఇన్సూరెన్స్‌లపై జీరో జీఎస్టీ, స్టేషనరీ సహా 220 నిత్యావసర వస్తువుల ధరలపై 18శాతం నుంచి 5 శాతానికి జీఎస్టీ తగ్గిందన్నారు. జీఎస్టీని తగ్గించడంతో జీడీపీ దాదాపు 1శాతం పెరిగే అవకాశముందన్నారు.

కాంగ్రెస్ ఏడుపు..

జీఎస్టీని తగ్గింపుతో ప్రజలు సంతోషంగా ఉంటే.. కాంగ్రెస్ ఏడుస్తోందని అర్వింద్ విమర్శించారు. జీఎస్టీ తగ్గింపుతో రాష్ట్ర ప్రభుత్వానికి రూ.7వేల కోట్లు నష్టం జరిగిందని సీఎం సహా మంత్రులు పేర్కొనడం సిగ్గుచేటన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగోళ్ల లక్ష్మీనారాయణ, సీనియర్ నాయకులు న్యాలం రాజు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు పాట్కూరి తిరుపతిరెడ్డి, దిశా కమిటీ సభ్యులు ప్రదీప్‌రెడ్డి, లింగంపల్లి లింగం, హన్మంతరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అక్టోబర్ 8 నుంచి ఎంఈడీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో అక్టోబర్ 8 నుంచి ఎంఈడీ 2వ సెమిస్టర్ థియరీ రెగ్యులర్ పరీక్షలు ప్రారంభమవుతాయని కంట్రోలర్ సంపత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలు అక్టోబర్ 15 వరకు కొనసాగుతాయన్నారు. విద్యార్థులు పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్ సైట్‌ను సందర్శించాలని ఆయన సూచించారు.

సీపీని కలిసిన ప్రభుత్వ ప్లీడర్



ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని సీపీ క్యాంప్ కార్యాలయంలో సీపీ పోతరాజు సాయిచైతన్యను మంగళవారం జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టు ప్రభుత్వ ప్లీడర్(పీపీ) దయాకర్‌గౌడ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా సీపీకి ఆయన పుష్పగుచ్ఛం అందజేశారు. సీపీ ఆయనకు అభినందనలు తెలిపారు.

గురుకుల సిబ్బందికి ఒకరోజు శిక్షణ



మోపాల్: మండలంలోని కంజర్ మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో మంగళవారం ఉమ్మడి జిల్లా గురుకులాల సిబ్బందికి ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గురుకులాల్లోని రెగ్యులర్ జూనియర్ అసిస్టెంట్లు, డీఈఓలు, ఐసీటీలకు పలు అంశాలపై ఆర్‌సీవో సత్యనాథ్‌రెడ్డి అవగాహన కల్పించారు. గురుకులాల ఏర్పాటు, ఉద్దేశం, ఉద్యోగుల విధులు, బాధ్యతల గురించి వివరించారు. ప్రిన్సిపాల్ మురళీ, సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, జూనియర్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌మార్కెట్‌పై చర్యలు తీసుకోవాలి



కామారెడ్డి టౌన్: కల్తీ సామగ్రిని విక్రయిస్తున్న జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ఎదురుగా గల ఓ కిరాణ సూపర్ మార్కెట్‌పై చర్యలు తీసుకోవాలని పట్టణానికి చెందిన ప్రవీణ్‌కుమార్ అనే వ్యక్తి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రెండు రోజుల క్రితం సదరు దుకాణంలో నల్ల నువ్వులు, శనగలు ఇతర సామగ్రి కొనుగోలు చేసానని తెలిపారు. రాత్రివేళ నల్లనువ్వులను నానబెట్టడానికి నీటిలో వేయగానే, కాసేపటికి నీరు నల్లరంగులోకి మారాయన్నారు. అలాగే 250 గ్రాములు శనగలు కొనుగోలు చేస్తే 180 గ్రాములు మాత్రమే వచ్చాయన్నారు. ఈ విషయమై కలెక్టర్‌కు, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అధికారులు స్పందించి, కల్తీ సామగ్రి విక్రయించే దుకాణంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

డైట్ బిల్లులు వచ్చేదెప్పుడో?

- జిల్లాలోని ప్రభుత్వ హాస్టళ్లకు కొన్ని నెలలుగా నిలిచిన నిధులు
- ఇబ్బందుల్లో విద్యార్థులు, వార్డెన్లు

ఆర్మూర్‌టౌన్: జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాలకు కొన్ని నెలలుగా డైట్ బిల్లులు రావడం లేదు. దీంతో విద్యార్థులు, వార్డెన్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో వార్డెన్లు తమ జేబుల్లోంచి డబ్బులు వెచ్చించి, విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తున్నామని వాపోతున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సరఫరా నిలిచే ప్రమాదం...

హాస్టల్స్‌కు రైస్, పప్పులు, చింతపండు, గుడ్లు, చికెన్, కూరగాయలు, వంటగ్యాస్ సరఫరా జరుగుతున్నప్పటికీ బకాయిలు ఎక్కువ కావడంతో సరఫరాదారులు వెనుకంజ వేస్తున్నారు. ఈ పరిస్థితి మరి కొన్ని రోజులు కొనసాగితే, విద్యార్థులకు ఆహార పదార్థల సరఫరా నిలిచే ప్రమాదం ఉంది. సరఫరాదారులు బిల్లులు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొంటున్నారు. పలుచోట్ల హాస్టల్ వార్డెన్లు తమ జేబుల్లోంచి డబ్బులు వెచ్చించి, విద్యార్థులకు సమస్యలు రాకుండ చూస్తున్నారు. అలాగే హాస్టల్స్‌లో వందలాది కుక్‌లు, కాంటీన్ సిబ్బంది, వాచ్‌మెన్‌లకు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి వేతనాలు అందడం లేదు. దీంతో వారు జీతాలు లేకి కుటుంబ పోషణ కష్టమవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల అద్దె భవనాల్లో హాస్టల్స్ నిర్వహిస్తుండగా, ఇంటి యజమానులకు కొన్ని నెలలుగా బిల్లులు రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులు చెల్లించాలని పలువురు కోరుతున్నారు.



అద్దె భవనంలో కొనసాగుతున్న ఆర్మూర్ హాస్టల్

వెంటనే విడుదల చేయాలి..

బిల్లులు రాకపోవడంతో వసతి గృహం నిర్వహణ కష్టంగా మారింది. హాస్టల్ భవనం అద్దె, పిల్లకు కాస్మెటిక్ చార్జీలు కొన్ని నెలలుగా రావడం లేదు. నిధులు లేక జిల్లాలోని వసతి గృహాల అధికారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి. – సౌడ సురేష్, హాస్టల్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

జిల్లాలో 84 హాస్టల్స్..

జిల్లాలో మొత్తం 84 ప్రభుత్వ వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో బీసీ హాస్టల్స్ 32, ఎస్సీ హాస్టల్స్ 42, ఎస్సీ హాస్టల్స్ 7, ఆశ్రమ హాస్టల్స్ 3 ఉన్నాయి. ప్రతి హాస్టల్‌లో సుమారు 100 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. ప్రతి విద్యార్థికి ప్రతినెలా సగటున డైట్ ఖర్చు రూ.1435గా ప్రభుత్వం చెల్లిస్తుంది. 7వ తరగతి వరకు ఒక విద్యార్థికి నెలకు రూ.1330, 8–10 తరగతుల విద్యార్థులకు రూ.1540. పోస్ట్‌మెట్రిక్ స్థాయిలో విద్యార్థికి నెలకు సుమారు రూ.2100 ఖర్చు చేస్తుంది. కానీ ఎస్టీ హాస్టల్స్‌కు జనవరి నుంచి బిల్లులు రావడం లేదు. అలాగే ఎస్సీ, బీసీ హాస్టల్స్‌కు మార్చి నుంచి బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయి. దీంతో జిల్లాలోని హాస్టల్స్ కొన్ని నెలలుగా ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. డైట్ బిల్లులు, రెంట్, చిన్న చిన్న మరమ్మతుల ఖర్చులు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది వేతనాలు నెలల తరబడి పెండింగ్‌లో ఉండటంతో పరిస్థితి దయనీయంగా మారింది. విద్యార్థులకు ఇచ్చే ఆహారం నాణ్యతపై కూడా ఆందోళనలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం జిల్లాలోని హాస్టళ్లకు సంబంధించిన పెండింగ్ డైట్ బిల్లులు రూ.లక్షల్లో ఉన్నాయి. మొత్తంగా హాస్టళ్లకు సుమారు రూ.10కోట్ల వరకు నిధులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం.

గ్రామ పాలన అధికారుల విధులివే..

మీకు తెలుసా?

రామారెడ్డి: తెలంగాణ ప్రభుత్వం ఇటీవల క్లస్టర్ల వారీగా ఒక్కో గ్రామానికి ఒక్కో గ్రామ పాలన అధికారిని నియమించింది. వారు నిర్వహించే విధుల వివరాలు ఇలా ఉన్నాయి.

- గ్రామస్థాయిలో భూఖాతా(విలేజ్ ఎకౌంట్) నిర్వహణ.
- పహాణీల నమోదు.
- రెవెన్యూ మాతృదస్వరం నిర్వహణ
- అన్ని రకాల భూముల నిర్వహణ మార్పులు, చేర్పులు.
- లావుణీ అసైన్డ్, దేవాదాయ వర్క్స్, ప్రభుత్వం సేకరించిన భూముల నిర్వహణ.
- ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు, నీటి వనరుల కింద భూముల పరిరక్షణ.
- అన్యాక్రాంతం, ఆక్రమణలపై చర్యలకు సహకరించడం.
- భూమి ఖాతాల నిర్వహణ, మార్పులు, చేర్పులు నమోదు.
- భూ సర్వేకు ఎవరైనా దరఖాస్తు చేసుకుంటే సేవలందించడం.
- ప్రకృతి విపత్తులు సంభవిస్తే నష్టం అంచనా.
- గ్రామస్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులను గుర్తించడం.

నిమిషాల్లోనే ఈ-పాన్ కార్డు పొందొచ్చు

సమాచారం..



కమ్మర్‌పల్లి: బ్యాంకులో ఖాతా తెరవాలంటే పాన్ కార్డు తప్పనిసరిగా ఉండాలి. ఇందుకోసం మనం వాడుతున్న సెల్‌ఫోన్‌లోనే దరఖాస్తు చేసుకొని, నిమిషాల్లోనే సులభంగా ఈ-పాన్ కార్డు పొందవచ్చు.

- మొదటగా గూగుల్‌లో 'ఈ-ఫిల్లింగ్ అని టైప్ చేయాలి. తర్వాత ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ హోమ్ పేజీలోకి వెళ్లి ఇన్‌స్టంట్ ఈ-పాన్ అనే ఐచ్ఛికాన్ని ఎంచుకొని 'గెట్ న్యూ పాన్ కార్డు' అని నమోదు చేయాలి.
- తర్వాత ఆధార్ నంబర్‌ను నమోదు చేయగానే జనరేట్ ఆధార్ ఓటీపీ అని సూచిస్తుంది. దాని మీద క్లిక్ చేయగానే ఆధార్ కార్డుకు లింక్ ఉన్న ఫోన్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది.
- ఓటీపీ నమోదు చేయగానే ఆధార్‌లో ఉన్న వివరాలు కనిపిస్తాయి. సరి చూసుకుని అనుమతించాలి.
- అనంతరం దరఖాస్తు చేసుకున్నట్లు అక్నాలెడ్జ్‌మెంట్ నంబర్ మన ఫోన్‌కు సందేశం వస్తుంది.
- మళ్లీ మన విన్నపాన్ని ఆమోదించినట్లు కొద్ది గంటల్లోనే సందేశం వస్తుంది.
- రాగానే ఈ-ఫైలింగ్‌లోనే మళ్లీ హోం పేజీకి వెళ్లి ఇన్‌స్టంట్ ఈ-పాన్‌ని ఎంచుకోవాలి.
- డౌన్లోడ్ ఈ-పాన్ మీద క్లిక్ చేసి ఆధార్ నంబర్ ఎంటర్ చేస్తే ఓటీపీ అడుగుతోంది. ఓటీపీ ఎంటర్ చేయగానే పాన్ కార్డు ఫైల్ రూపంలో డౌన్‌లోడ్ అవుతుంది.
- ఫైల్‌ను ఓపెన్ చేయాలంటే పుట్టినరోజు తేదీని ఎంటర్ చేస్తే పాన్‌కార్డు ఓపెన్ అవుతుంది.

అర్బన్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ
- నగరంలోని పలు డివిజన్లలో పర్యటన



శ్రీనగర్ కాలనీలో పర్యటిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్, కమిషనర్ దిలీప్‌కుమార్

సుభాష్‌నగర్: నిజామాబాద్ కార్పొరేషన్‌లోని ప్రజలకు మౌలిక వసతులు కల్పించి, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యమని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. నగరంలోని 45వ డివిజన్ శ్రీనగర్ కాలనీలో మంగళవారం ఆయన మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్‌తో కలిసి పర్యటించారు. ఈసందర్భంగా కాలనీవాసులు పలు సమస్యలను ఎమ్మెల్యే, కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బాల హనుమాన్ మందిరం పక్కన కొత్త బ్రిడ్జి నిర్మాణం చేపట్టి శాశ్వత పరిష్కారం చూపుతానని కాలనీవాసులకు హామీనిచ్చారు. డ్రెయినేజీ సమస్యలు తలెత్తకుండా మున్సిపల్ సిబ్బంది నిత్యం డ్రెయినేజీ పూడికలు తీయాలని, అవసరమున్నచోట డ్రెయినేజీ పునర్నిర్మాణం చేపట్టాలని కమిషనర్‌కు సూచించారు. నగరంలో వీధి దీపాల సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని తెలిపారు. నగరంలో అభివృద్ధి పనుల కోసం స్పెషల్ ఫండ్ రూ.100 కోట్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరినట్లు పేర్కొన్నారు. నగరంలో రాత్రి సమయంలో ఆకతాయిలు మద్యం తాగి న్యూసెన్స్ చేస్తున్నారని కాలనీవాసులు విన్నవించగా, ఏసీపీతో మాట్లాడి రాత్రి సమయంలో పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీనిచ్చారు. మున్సిపల్ ఏఈ పావని, బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి నాగోళ్ల లక్ష్మీనారాయణ, నాయకులు ఆకుల శ్రీనివాస్, నరేష్, బొబ్బిలి వేణు, ఎర్రన్న, పవన్, ఆనంద్, కాలనీవాసులు, తదితరులు ఉన్నారు.

నిజామాబాద్‌కు కొత్త రైళ్లు

- ఎంపీ అర్వింద్ ధర్మపురి
- నగర రైల్వేస్టేషన్ అభివృద్ధి పనుల పరిశీలన



ఖలీల్‌వాడి: నిజామాబాద్ రైల్వే స్టేషన్‌కు త్వరలో మరిన్ని కొత్త రైళ్లు అందుబాటులోకి వస్తాయని ఎంపీ అర్వింద్ ధర్మపురి అన్నారు. నగరంలోని రైల్వే స్టేషన్‌ను మంగళవారం మధ్యాహ్నం ఆయన, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణతోకలిసి సందర్శించారు. స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. రైల్వే అధికారులతో మాట్లాడి, పనుల వివరాలను తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులతో ప్రయాణికులకు ఇబ్బందులు తగ్గుతాయని తెలిపారు. స్టేషన్‌లో మరో రెండు రైల్వే లైన్లు, రెండు ప్లాట్‌ఫామ్స్ పెరుగుతున్నట్లు చెప్పారు. కొత్త రైళ్ల రాకతో ప్రయాణికుల రాకపోకలు కూడా పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, రైల్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి బ్యాడ్మింటన్‌లో ప్రతిభ



క్రీడాకారులను సన్మానిస్తున్న ఎస్ఈ రవీందర్

సుభాష్‌నగర్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాయపూర్‌లో ఇటీవల నిర్వహించిన జాతీయస్థాయి విద్యుత్ బాడ్మింటన్ పోటీల్లో ఓపెన్ డబుల్స్ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన జిల్లాకు చెందిన ఇంజినీర్ బి కృష్ణకాంత్‌ను ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ రాపెల్లి రవీందర్ మంగళవారం సన్మానించారు. అలాగే వరంగల్‌లో నిర్వహించిన ఇంటర్ సర్కిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్, చెస్ చాంపియన్‌షిప్‌లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జట్టు ఈవెంట్ విభాగంలో తృతీయ స్థానంలో నిలిచింది. వ్యక్తిగత విభాగంలో బి కృష్ణకాంత్ (బషీరాబాద్) ద్వితీయ స్థానం, డబుల్ విభాగంలో శివతేజ రెడ్డి (తాడ్వాయి) ద్వితీయ స్థానం సాధించారు. టీమ్ ఈవెంట్ విభాగంలో రూప్‌సాయి, ప్రశాంత్ జట్టులో కీలకపాత్ర పోషించి తృతీయస్థానంలో నిలిచేలా ప్రతిభ కనబర్చడంతో ఎస్ఈ అభినందించారు. కార్యక్రమంలో డీఈ వెంకటరమణ, ఏఏవో గంగారాం, జేఏఓ సురేశ్‌కుమార్, పోశెట్టి, గోపి, రఘువీర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

25న ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం

బాన్సువాడ రూరల్: బాన్సువాడలోని లక్ష్మీనర్సింహ కల్యాణ మండపంలో ఈనెల 25న ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు సంఘ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజుతోపాటు సంఘం రాష్ట్ర కమిటీ, రీజినల్ కమిటీ సభ్యులు తదితరులు హాజరవుతారన్నారు. కార్యక్రమానికి బాన్సువాడ డిపో పరిధిలోని ఆర్టీసీ కార్మికులతో పాటు రీజియన్ పరిధిలోని అన్ని డిపోల అధ్యక్ష, కార్యదర్శులు హాజరై విజయవంతం చేయాలని సంఘ సభ్యులు కోరారు.

సకల దేవతల నెలవు.. బొమ్మల కొలువు..



నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సాయి టవర్స్‌లో మంగళవారం దేవీ నవరాత్రుల సందర్భంగా సకల దేవతల స్వరూపంగా ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ఆకట్టుకుంటుంది. సాయిటవర్స్‌కి చెందిన నిర్మల–రాముశర్మ దంపతులు ఏటా నవరాత్రుల్లో బొమ్మల కొలువును ఏర్పాటుచేస్తారు. శ్రీనివాసుని కల్యాణం, మహావిష్ణువు దశావతారాలు, దుర్గానవరాత్రుల ప్రత్యేక నవశక్తి రూపాలు ఇలా పదుల సంఖ్యలో పురాతన ఇతిహాస ఘటనలను తెలిపేలా బొమ్మల కొలువును ఏర్పాటు చేశారు. ఇంటి ఆచారం, ఆనవాయితీ ఆధారంగా ఆడపిల్లలతో మెట్టుమెట్టుగా బొమ్మలను అమర్చుతారు. ఇవి ఎప్పుడు బేసి సంఖ్యలోనే ఉంటాయి. ఈ బొమ్మల కొలువు స్థానికులను విశేషంగా ఆకట్టుకుంటుంది.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

ముగిసిన కబడ్డీ జట్టు శిక్షణ శిబిరం



నిజామాబాద్ నాగారం: నగరంలోని జిల్లా కబడ్డీ జట్ల శిక్షణ శిబిరం మంగళవారం ముగిసినట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు అంద్యాల లింగయ్య, ప్రధాన కార్యదర్శి గంగాధర్ రెడ్డి తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా జట్టుకు ఎంపికైన అండర్–16 బాలబాలికల జట్ల వివరాలను ప్రకటించారు. బాలుర కబడ్డీ టీం కోచ్ అన్వేష్, మేనేజర్ వినోద్, బాలికల కబడ్డీ టీమ్ కోచ్ సాయిలు, మేనేజర్ అనురాధ సమక్షంలో ఇట్టి క్రీడాకారులను ఎంపిక చేసినట్లు వివరించారు. ఈ నెల 25 నుంచి 28 వరకు ముప్కాల్ భుదేవ్ ఇండోర్ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో ఇట్టి క్రీడాకారులు పాల్గొననున్నట్లు తెలిపారు. ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ సభ్యులు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్రజట్టుకు ఇద్దరు జిల్లావాసుల ఎంపిక



శ్రీరోహాణ్



రీతిక

నిజామాబాద్ నాగారం: రాష్ట్ర సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ జట్టులో ఇద్దరు జిల్లావాసులు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన ఎంపిక పోటీల్లో జిల్లా క్రీడాకారులు ఎ. రీతిక (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తిమ్మాపూర్), శ్రీరోహాణ్ (ఉప్పల్‌వాయి) తెలంగాణ జట్టుకు ఎంపికయ్యారు. వీరు రాష్ట్ర జట్టుతో కలసి ఈనెల 24 నుంచి 28 వరకు తమిళనాడు లో జరిగే 44వ జాతీయస్థాయి సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొంటారని జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్యామ్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారులను సంఘ ప్రతినిధులు, వివిధ క్రీడా సంఘాల సభ్యులు అభినందించారు.

స్వగ్రామానికి చేరిన మృతదేహం



మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇటీవల బహ్రెయిన్ దేశంలో మృతిచెందగా, మంగళవారం మృతదేహం స్వగ్రామానికి చేరింది. వివరాలు ఇలా.. మండలంలోని చుక్కాపూర్ గ్రామానికి చెందిన కామటి ఎల్లయ్య(49) మూడు నెలల క్రితం బహ్రెయిన్ వెళ్లాడు. ఈ నెల 12న ఛాతిలో నొప్పంటూ కుప్పకూలిపోయాడు. వెంటనే ఎల్లయ్యను స్నేహితులు ఆస్పత్రికి తీసుకువెళుతుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. మృతుడి బంధువులు, అక్కడి స్నేహితులు మృతదేహం స్వగ్రామానికి వచ్చేలా కృషి చేయడంతో మంగళవారం చేరింది. ఎల్లయ్య మృతదేహాన్ని చూసి గ్రామస్తులు, కుటుంబసభ్యులు కంటతడి పెట్టారు. ప్రభుత్వం స్పందించి మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

యువకుడి అదృశ్యం



నవీపేట: మండల కేంద్రంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన నందిపేట కృష్ణ(33) అదృశ్యమైనట్లు ఎస్సై తిరుపతి మంగళవారం తెలిపారు. ఈనెల 19న కూలీ పనులకు వెళ్లిన కృష్ణ ఇప్పటికీ ఇంకా ఇంటికి తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. అతడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నలుగురిపై కేసు నమోదు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించే మహిళా కానిస్టేబుల్‌ను బెదిరించిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై భార్గవ్‌గౌడ్ తెలిపారు. మండలంలోని పోచారం ప్రాజెక్టు వద్ద ఇటీవల 'ప్రాజెక్టు వద్దకు ఎవరూ వెళ్లవద్దని' అక్కడ హెచ్చరిక ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. హైదరాబాద్ ప్రాంతానికి చెందిన మహ్మద్ సైపుల్లాఖాన్, మహ్మద్ సనాహుల్లాఖాన్, మహ్మద్ అబ్దుల్ వదూద్ ఖురైషి, లులుఖాన్ అనే వ్యక్తులు సదరు ఫ్లెక్సీని తొలగించి కారులో ప్రాజెక్టు వద్దకు వెళ్లారు. దీంతో వారిని అక్కడి నుంచి వెళ్లిపోవాలని కానిస్టేబుల్ అన్వరీ వారిని హెచ్చరించారు. కానీ వారు వినిపించుకోకుండా కానిస్టేబుల్‌పై బెదిరింపులకు పాల్పడ్డారు. కారుతో కానిస్టేబుల్‌ను ఢీకొట్టేలా భయపెట్టారు. దీంతో నలుగురిపై కేసునమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

బోరు మోటారు చోరీ

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి ఆర్టీసీ బస్టాండ్‌లోని బోరుమోటారును గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. బస్టాండ్ సిబ్బంది ఈ విషయాన్ని గుర్తించి ఆర్టీసీ ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఆర్టీసీ అధికారులు మంగళవారం బస్టాండ్‌ను సందర్శించి బోరును పరిశీలించారు. వెంటనే డిచ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆర్టీసీ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ జరుపుతున్నట్లు ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రం పరిధిలోని జాతీయ రహదారి 44పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు అయ్యాయి. వివరాలు ఇలా.. మండల పరిధిలోని వజ్జపల్లి గ్రామానికి చెందిన లింగాల సాయికుమార్, దూస్‌గాం శ్రీకాంత్ మంగళవారం బైక్‌పై కామారెడ్డి నుంచి వజ్జపల్లి బయలుదేరారు. మండల కేంద్రం సమీపంలో వీరి బైక్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వారిని చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. వారిలో శ్రీకాంత్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

తప్పిపోయిన యువకుడు.. కుటుంబ సభ్యులకు అప్పగింత



ఎల్లారెడ్డి: పట్టణానికి చెందిన ఓ యువకుడు తప్పిపోగా, మండలంలోని ఓ వ్యక్తి అతడిని గుర్తించి కుటుంబసభ్యులకు అప్పగించాడు. వివరాలు ఇలా.. ఎల్లారెడ్డిలోని బీసీ కాలనీకి చెందిన హమీద్ నాలుగు రోజుల క్రితం హైదరాబాద్ నుంచి ఎల్లారెడ్డికి వస్తున్నట్లు కుటుంబసభ్యులకు తెలిపాడు. కానీ అతడు ఇంటికి చేరకపోవడంతో కుటుంబసభ్యులు అతడి వివరాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈక్రమంలో ఎల్లారెడ్డి మండలం అన్నాసాగర్ గ్రామానికి చెందిన రామాగౌడ్ హైదరాబాద్‌కు వెళ్లగా బొల్లారం రైల్వేస్టేషన్ దగ్గర అతడికి హమీద్ కనిపించాడు. వెంటనే అతడు హమీద్‌ని కలిసి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. అనంతరం హమీద్‌ను అతడి బంధువులకు అప్పగించారు. దీంతో రామాగౌడ్‌ను స్థానికులు అభినందించారు.

చోరీ కేసులో ఒకరికి ఏడాది జైలు

జక్రాన్‌పల్లి: మండలంలోని తొర్లికొండ గ్రామంలో చోరీకి పాల్పడ్డ నిందితుడికి ఆర్మూర్ కోర్టు ఏడాది జైలు శిక్ష విధించినట్లు ఎస్సై మాలిక్ రహమాన్ తెలిపారు. వివరాలు ఇలా.. తొర్లికొండ గ్రామంలోని గడ్డం భూమేశ్వర్ ఇంట్లో మార్చి 27న చోరీ జరిగింది. దుండగుడు ఇంటి తాళాలు పగుల గొట్టి ఇంట్లోని డబ్బులు, వంట సామగ్రిని ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. నిందితుడిగా అదే గ్రామానికి చెందిన నూనె కిరణ్‌ను గుర్తించారు. దీంతో అతడిని పట్టుకొని ఆర్మూర్ కోర్టులో హాజరుపర్చారు. జడ్జి విచారణ జరిపి నిందితుడికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్సై తెలిపారు.

వారం రోజులు.. రెండు భారీ చోరీలు

- ఇటీవల నగరంలోని ఓ ఇంట్లో 19తులాల బంగారం, రూ.10లక్షల విదేశీ కరెన్సీ అపహరణ
- తాజాగా అర్చకుడి ఇంట్లో..

ఖలీల్‌వాడి: నగరలో శివారు కాలనీలోని తాళం వేసిన ఇళ్లనే దొంగలు టార్గెట్ చేస్తున్నారు. గత వారం రోజుల్లో దుండగులు నగరంలో రెండు భారీ చోరీలకు పాల్పడ్డారు. ఇటీవల నగరంలోని ఐదో టౌన్ పరిధిలోగల ఆసద్‌బాబానగర్‌లో తాళం వేసిన ఇంట్లోకి దుండగులు చొరబడి బీరువాలో ఉన్న 19 తులాల బంగారం, రూ.10లక్షల విదేశీ కరెన్సీని చోరీ చేశారు. ఈ ఘటన మరువకముందే తాజాగా మంగళవారం నాగారంలోని బ్రహ్మణ కాలనీలో ఓ అర్చకుడి ఇంట్లోని 30 తులాల బంగారంను చోరీ చేశారు. వారం రోజుల్లో రెండు భారీ చోరీలు చోటుచేసుకోవడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.



దసరా సెలవుల నేపథ్యంలో..

దసరా సెలవులు రావడంతో కుటుంబసభ్యులు ఇళ్లకు తాళాలు వేసి పిల్లలతో కలిసి బంధువుల ఇళ్లకు వెళుతున్నారు. ఈక్రమంలో దుండగులు తాళం ఉన్న ఇళ్లను గుర్తించి, తమకు అనువైన సమయంలో, జనసంచారం తక్కువ ఉన్న ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్నారు. ఈనేపథ్యంలో ప్రజలు ఇళ్లకు తాళాలు వేసి, ఊర్లకు వెళ్లినట్లయితే తమకు సమాచారం అందించాలని పోలీసులు సూచిస్తున్నారు. అలాగే విలువైన వస్తువులను ఇంట్లో ఉంచకుండ, సేఫ్టీ ప్రదేశాల్లో, బ్యాంకు లాకర్లలో ఉంచాలని పేర్కొంటున్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

కుటుంబసభ్యులతో కలిసి బయటకు వెళ్లేటప్పుడు ఇంటికి తాళం వేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. అలాగే ఇంట్లో బంగారం, నగదు ఉంచవద్దు. కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే డయల్ 100కు సమాచారం అందించాలి. ఇంటికి సెంట్రల్ లాకింగ్ సిస్టం ఏర్పాటు చేసుకోవాలి.

– బూస శ్రీనివాస్, నార్త్ సీఐ, నిజామాబాద్

బ్రాహ్మణ కాలనీలో 30 తులాల బంగారం దొంగతనం

ఖలీల్‌వాడి: నాగారంలోని బ్రాహ్మణ కాలనీకి చెందిన పవన్ శర్మ అనే అర్చకుడి ఇంట్లో చోరీ జరిగినట్లు నార్త్ సీఐ బూస శ్రీనివాస్ తెలిపారు. వివరాలు ఇలా.. బ్రాహ్మణకాలనీకి చెందిన పవన్ శర్మ మంగళవారం ఉదయం ఇంటికి తాళం వేసి, పూజలు చేయడానికి బయటకు వెళ్లాడు. మధ్యాహ్నం అతడు తిరిగి ఇంటికి రాగా ఇంటి తాళాలు పగలగొట్టి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే వారు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. దుండగులు ఇంట్లోని లాకర్‌ను ధ్వంసం చేసి, అందులో ఉన్న 30 తులాల బంగారంను ఎత్తుకెళ్లారు. పోలీసులు సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించగా, ఇద్దరు గుర్తు తెలియని యువకులు బైక్‌పై వచ్చిన ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లోకి వెళ్లినట్లు తెలిసింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



లాకర్‌ను పరిశీలిస్తున్న నార్త్ సీఐ బూస శ్రీనివాస్